# ప్రసన్నోదారం



విహారి-శాలివాహన

'మేనేజరుగారు పిలుస్తున్నారు.' తక్కున చెప్పి వెళ్ళిపోయాడు రహీం.

మేనేజరుగారి పిలుపులోని అధికారం రహీం మాటల్లో ద్యోతకమవుతూ వుంటుంది.

ఛేంబర్స్‌లోకి వెళ్ళాను. "నమస్తే."

పట్టాభిగారు తల పంకించేరు. నాన్ని ప్రతి నమస్కారం అనుకోవాలి!

ఫైలు మూసి ప్రక్కనే వున్న ట్రేలో పడేశారు. ఆయన టేబుల్ మీద ఎడమచేతి వైపు నకపొగ్గా పేర్చివున్న ఫైళ్ళ దొంతర నుంచి మరో ఫైలు తీసుకున్నారు. రివాల్వింగ్ చైర్లో కొంచెం ప్రక్కకి తిరిగి రెండు చేతు లతోనూ ఫైల్‌ని పైకెత్తి పట్టుకుని దాన్లోకి తల దూర్చేశారు.

ఎన్నాతు చెప్పినా ఇంతే! పెద్ద దర్జా— కూర్చోమనే సభ్యత లేదు. ఎటువంటివారిని, అందునా తన ఆఫీస్ స్టాఫ్‌ని కూర్చోమనటం తన హోదాకు భంగకరం.

ఇదో కాంప్లెక్స్! ఎంతసేపు మాట్లాడినా నిలబడి మాట్లాడాలి. పోనీ, త్వరగా తెములుచు కుని బయటపడదామంటే, విషయాన్ని ఒక పట్టాన చెప్పడు. అదొక పోజు!

నాకు చిర్రెత్తు కొచ్చింది. అసహనంగా గొంతు సవరించుకున్నాను.

పట్టాభిగారు క్రీగంట నన్ను చూసేరు. "ఏం క్షణంపేపు ఆగలేవా? సకిలిస్తావేమిటి?" అని ప్రశ్నిస్తున్న చూపు అది.

క్షణాల తర్వాత కుర్చీలో కూర్చున్నాను.

పట్టాభిగారు ఫైల్‌ని టేబుల్ మీద పడే శారు. ఇబ్బందిగా మొహంపెట్టారు. నావైపు ఎగాదిగా చూశారు. ఆయన చూపులు నాకూ ఇబ్బంది కలిగించినై. పమిట సర్దుకుని నేల చూపులు చూడసాగేను.

టేబుల్ సొరుగులోంచి కాగితంతీసి అందించేరు.

నేను చదివేను. 'ఓహో' అనుకున్నట్టు తల పంకించేను.

"చూశారుగా. విషయం మీకు అర్థమయ్యే వుంటుంది." సిగరెట్ వెలిగించుకుంటూ అన్నారు పట్టాభిగారు.

"ఎస్—సర్. నాకు చాలా ఆనందంగా వుంది. మీరు చేసిన సహాయాని చాలా థాంక్స్!" 'సహాయానికి' అనే మాటను నొక్కి చెప్పేను.

నా 'రియాక్షన్'కి ఆశ్చర్యపోయారు పట్టాభిగారు. ఆయన ముఖకవళికలు మారటం నేను గమనిస్తాననే సంశయంతో కాబోలు సిగరెట్ పొగని వెనక్కి వదులుతున్నట్టు వెనక్కి తిరిగేరు. రివాల్వింగ్ చైర్ కిరకిర లాడింది.

"నిజానికి నాకీ పని చేయటం యిష్టం లేదు. ఐ డోంట్ లైకిట్-ఎస్. నా స్థితి గతులూ, ఇబ్బందులూ ఇదివరకే చెప్పాను గదా! మీరు కొంచెం నెమ్మదిగా ఆలోచిస్తే ఈ 'అన్‌ప్లెజెంట్‌నెస్'ని 'అవాయిడ్' చెయ్యొచ్చు. ఏమంటారు?"

పట్టాభిగారి ఒక్కొక్క మాటా నాకు— ఒక్కొక్క డిగ్రీ చొప్పున కోపం తెప్పి స్తోంది. తక్కున కుర్చీలోంచి లేచేను. "నేను ఏది చెప్పినా ఒకేసారి చెప్తాను." అంటూ బయటికి రాబోయేను.

పట్టాభిగారు గిరుక్కున ఇటు తిరిగేరు. పెదవులు వెనక్కీ ముందుకూ కదిలిస్తూ "ఆల్‌రైట్!" అని అరిచేరు.

నేను కదిలేను.

"మిస్ శకుంతలా! ఆ కాగితాన్ని ఇక్కడ పెట్టి వెళ్ళండి."

నా చేతిలో కాగితం వున్న విషయం స్ఫురణకొచ్చింది. దాన్ని టేబుల్ మీద వుంచే శాను.

నేను వచ్చేస్తుంటే పట్టాభిగారి మాటలు వినిపించినై. "ఇట్ ఈజ్ స్టిల్ అన్‌సైన్డ్.

సమయం మించిపోలేదు. ఆలోచించుకోండి."

"హుం...."

—సీట్లోకొచ్చి కూర్చున్నాను సుందరి కుర్చీని పక్కకి లాక్కుని నాకేసి వంగింది. "ఏంవంటున్నాడు మీ ఏకలవ్యుడు?" సన్నగా నవ్వింది.

ఈమెకు ఇదొక సరదా; చెడ్డ అలవాటూ! ఛేంబర్స్‌లోకి వెళ్ళొచ్చినప్పుడల్లా పట్టాభి గారు ఏం మాట్లాడారో పూస గుచ్చినట్లు చెప్పమని ప్రాణం తీస్తుంది.

నెల రోజుల క్రితం ఇలాగే ఉదర గొట్టేస్తుంటే మాటల ధోరణిలో నోరజారేను: 'పట్టాభిగారికి పెళ్ళి చేసుకోవాలని వుందిట.' అని. వెంటనే పసి గట్టేసింది. ఆయన నాతో ఏయే విషయాలు మాట్లాడిందీ తనకి చెప్పటం మొదలెట్టింది. నేను ఆశ్చర్యంగా గుడ్లప్పగించి వింటూ కూర్చున్నాను. ఆయన మాటలూ, ప్రవర్తనా బహుశా తనకూ అనుభవమేమోలే అనుకున్నాను.

అప్పట్నుంచీ ఇదీవరస! ఆయన్ని 'ఏకలవ్యుడు' అంటూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు 'దుష్యంతుడు' అనీ కిసుక్కున నవ్వుతుంది.

"గాంధర్వమా, రాక్షసమా ఏది ఆచరిస్తాట్ట?" జోక్ చేసింది సుందరి.

నేను మాట్లాడలేదు.

"ఏంవిటోయ్ అంత సీరియస్ యం. డీ. గారి, డీ. ఓ. లెటర్‌కి రిప్లైలా, అర్జెంట్‌గా సమాధానం చెప్పమన్నాడా ఏంటి?" అడిగింది.

"అదేంకాదు." విసుగ్గా అన్నాను.

"ఏంవిటి మరి?" కుర్చీలో ముందుకు జరిగి నా కుర్చీమీద చెయ్యి వేసింది.

"నన్ను మద్రాస్ ట్రాన్స్‌ఫర్ చేశారు." ఏ భావమూ వ్యక్తంకాని స్వరంతో చెప్పేను.

సుందరి ప్రమాన్పడి పోయింది "నిజంగా!" అని రెట్టించింది.

"అవును." అన్నాను; ఫైల్ సర్దుతూ.

—లంచ్ అవర్లో,

దిన పత్రిక చూస్తున్నా నన్న మాటేగానీ, ఆలోచనంతా పట్టాభిగారి గురించే సాగుతోంది. ఏభై ఏళ్ళు దాటి, నలుగురు పిల్లలున్న పట్టాభి గారి కోరిక; ఆ కోరికను సాఫల్యం చేసుకోవటానికి ఆయన అవలంబిస్తున్న పద్ధతి తలచుకుంటే విచారంగా వుంది.

సుందరి ఇందాక అన్నది, "ఆస్థీ, అంతస్థూ వున్నై. బట్టతల, కళ్ళజోడూ వున్నై. కారుంది, అహంకారం వుంది. ఆయనకేం తక్కువ" అని.

"నిజమే. ఆయనకేం తక్కువ!—నవ్వొచ్చింది.

"మీకో లెటరండీ" అంటూ కవరు పడేసి వెళ్ళాడు రహీం.

'వెడ్డింగ్' అన్న అక్షరాలూ, అడ్రసులోని దస్తూరీ నాలో అమితమైన ఉత్సాహాన్ని కలిగించినై.

పేపర్ పక్కన పడేసి కవరు చించి చూసేను.

"డాక్టర్. గాయత్రి. ఎం.బి.బి.యస్. కీ; శ్రీ ఖాదర్‌వలీకీ వివాహం...."

ఆశ్చర్యపోయాను, గాయత్రి డేర్ డెవిల్! కొత్త తరహా శుభలేఖ. మరోసారి చదువుకుని, దాన్ని పక్కన పెట్టాను.

గాయత్రి రాసిన ఉత్తరం తీసేను.

"శకూ, నీకీ శుభలేఖ ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు, అది 'కల్యాణ ఘడియ' మహత్యం అంటుంది అమ్మ. ఆ విషయం వదిలెయ్. ఆప్తులు, ఆత్మీయులు అయిన ఫ్రెండ్స్ అంతా తలా వో మూలకూ చెదరిపోయారు. కొందరి అడ్రస్‌లే తెలీవు. నువ్వొన్నా పెళ్ళికి తప్పకుండా రావాలి. పెళ్ళికి రమ్మంటున్నానని, ఆ సమయానికి సరాసరి మా వూరి రిజిష్ట్రారాఫీసుకు వచ్చేసేవ్! కనీసం రెండు రోజులు ముందుగా రా. రాలేకపోవటం వంటి 'సిల్లీ' మాటలు రాయకు. నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను; గాయత్రి."

మనస్సంతా ఎంతో తేలికైనట్లు ఆహ్లాదంగా, ఆనందంగా వుంది. పెద్ద డాక్టరై, ఇవాళ ఆదర్శ వివాహం చేసుకుంటున్న గాయత్రి నాకు ఎంతో దగ్గరి మనిషి! ఈ భావనే అదోవిధమైన గర్వం కలిగిస్తోంది.

"ఆప్తులు, ఆత్మీయులు అయిన ఫ్రెండ్స్" అంది గాయత్రి. రజని, రాధ, గౌరి గుర్తు కొచ్చారు. వాళ్ళ ముగ్గుర్నీ నన్నూ, గాయత్రినీ కలిపి 'క్లాస్‌మేట్స్' అంతా 'ఫస్ట్‌బెంచ్' అని పిలుస్తూ వుండేవాళ్ళు. స్నేహాన్ని గురించీ, సమాజంలో స్త్రీ స్థానాన్ని గురించీ, ఉద్యోగినిగా స్త్రీ హక్కుల్ని గురించీ, వివాహితగా స్త్రీ ప్రత్యేకతను గురించీ తమకు ఎన్నెన్నో ఆశయాలు, ఆదర్శాలు, విశ్వాసాలూ వుండేవి. కాలేజ్‌లో అందరూ తమవి 'విప్లవధోరణులు' అనుకుంటూ వుండేవాళ్ళు.

ఇవాళ—

ఒకరి అడ్రస్ మరొకరికి తెలీదు! రజని రిజల్ట్స్ రాకముందే పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళిపోయింది. రాధ, గౌరి- ఎక్కడున్నారో?

ఇప్పుడు గాయత్రి పెళ్ళి—

నేను—గాయత్రి పెళ్ళికి ప్రత్యేకాహ్వానితురాలిని! గాయత్రి మెడలో మంగళసూత్రం కట్టించుకుంటుంటే ఆమె వెనకాల నిలబడి, ఆమె జడను పైకెత్తి పెళ్ళికొడుక్కి సహాయ పడాల్సిన కన్నెపిల్లని!

నవ్వొచ్చింది—

పిన్ని కూతురు లక్ష్మి పెళ్ళి రోజు గుర్తుకొచ్చింది.

ఆవేళ—సుముహూర్తం అయిన తర్వాత ముత్తైదులకాళ్ళకి పసుపు రాస్తున్నాను. పక్కనున్న ఇల్లాలు నవ్వి నట్లనిపించి తలెత్తి చూసేను. ఆమె అదోలా నా వంక చూసి మొహం తిప్పుకుంది. ఆమెకు కొంచెం దూరంలో ఒకావిడ నన్ను ఓరగా చూస్తూ, లక్ష్మి కంటే ఆరేళ్ళు పెద్దదిట. ఎక్కడో ఉద్యోగం చేస్తున్నది ఇంకా పెళ్ళికాలేదుటే" అని పక్కనున్నావిడతో చెప్తూ కిసుక్కున నవ్వింది. పరీక్షగా చూసేన్నేను. నలుగురు పిల్లల్ని నెత్తినా, వొళ్ళోనూ ఎక్కించుకున్న మరో ఇల్లాలు నన్ను చూస్తూ ఏదో ఛలోక్తి విసురుతోంది.

పెళ్ళికాని పిల్లంటే—ఆడదానికీ అంత చులకన హేళన! నాకు వొళ్ళు మండిపోయింది. "పెళ్ళికాలేదని ఏడుపేకానీ, అయి తర్వాతేం వుంది— ఇదుగో, చీమిడి ముక్కులూ, తీతుకు పిట్టలూ." అన్నాను విసురుగా, పెద్ద రభస మొదలైంది. పిన్ని పరుగెత్తుకుంటూ వచ్చి వాళ్ళందరికి సర్ది చెప్పింది.

'గాయత్రి పెళ్ళిలో కూడా ఇలాంటి సంఘటనలు ఎదురుకావు గదా?' సందేహం కలిగింది. 'గాయత్రి వివాహం ఆదర్శ వివాహం. బహుశా ఈ హడావిడీ, ఆర్భాటమూ వుండవు' అనుకున్నాను.

బెల్ అయింది. ఆలోచన తెగింది. ఆఫీసు వర్క్‌లో పడ్డాను.

* * *

—ఓ వారం రోజులు సెలవు పెట్టి గాయత్రి పెళ్ళికి వెళ్ళేను.

పెళ్ళి ఎంతో నిరాడంబరంగా జరిగిపోయింది. నేను కాక మరో పదకొండుమంది అతిథులు. ఉదయం పదకొండు గంటలకి రిజిష్ట్రార్ ముందు సంతకాల పని పూర్తయిపోయింది.

గాయత్రీ ఖాదర్‌వలీ ఒకరిని చూసి ఒకరు సన్నగా నవ్వుకున్నారు. మేమంతా కంగ్రాచ్యులేషన్స్ చెప్పేము.

ఆ వెంటనే హోటల్లో భోజనం. ఆ తర్వాత అతిథులు వెళ్ళిపోయారు.

గాయత్రీ, ఆమె భర్తా, నేనూ ఇంటికి చేరేము.

సంభాషణంతా 'కాలేజ్ డేస్' గురించే సాగిపోయింది.

ఖాదర్‌వలీ చాలా 'సెన్స్ ఆఫ్ హ్యూమర్' వున్న మనిషి. అయితే, చాలా మితభాషి. వున్నట్టుండి ఓ చెణుకు విసిరి 'ఇక నవ్వుకోండి' అన్నట్టు తనపని తాను చూసుకునే తరహా. అతనిలోని ఈ లక్షణం నన్ను బాగా ఆకర్షించింది. అదే అన్నాను.

"గాయత్రిని అడగండి" అంటూ సన్నగా నవ్వి లేచి ఎక్కడికో వెళ్ళడానికి తయారు కాసాగేడు.

ఏమిటీ? అన్నట్టు గాయత్రికేసి చూసేను. గాయత్రి తనలోతను మురిసిపోతూ చెప్పింది. "నేను ఇదే 'పాయింట్' మీద తనని 'లవ్' చేసేనని గర్వం." అంది.


"నే వస్తామరి. పనుంది. మీట్ ఎగైన్" అంటూ వెళ్ళిపోయాడు ఖాదర్‌వలీ.

నేను తక్కున గాయత్రి కూర్చున్న మంచంమీదికి దూకేను. గాయత్రిమీదికి వాలి, ఆమె భుజాన్ని రెండు చేతులతోనూ పట్టుకుని ఊపుతూ. "దొంగపిల్లా సరీ గడసరివై పోయావే. అతనికేమో ఏ విధమైన ఆస్థీ, అంతస్తులూ లేవంటుంటివి ఉద్యోగమూ లేదు. చదువా మెట్రిక్యులేషన్.... ఏమిటీ కథ?" అని అప్పటివరకూ నా మనసును పీడిస్తున్న సందేహాన్ని అడిగేను.

గాయత్రి సన్నగా నవ్వింది. "అవన్నీ నాకున్నాయ్‌గదా. అందుకని" అని నా కళ్ళల్లోకి చూస్తూ "ఏం? నీకూ నా నిర్ణయం నచ్చలేదా? అమ్మకూ నచ్చలేదులే" అంది.

నేను కళవళపడ్డాను. "నా...నా...నా... అదికాదు. ఊరికే సందేహం' అన్నాను.

"చూడు శకూ. అంతో ఇంతో వ్యక్తిత్వం కావాలని గగ్గోలు పెడుతున్నాం మనం. మన




లాంటి వాళ్ళన్నా- అనుకున్న పనిచేసేందుకు ముందడుగు వేయకపోతే ఎలా ఏమంటావ్?"

"అవునవును." అన్నాను ఎటో చూస్తూ.

"ఖాదర్‌కి తనవాళ్ళెవరూ లేరు. టి. బి. వస్తే హాస్పటల్‌లో చేరాడు. మూడేళ్ళ క్రితం. ఆ తర్వాత పూర్తిగా తగ్గింది. అతని మనస్సు మంచిది, ఐ లైకిట్. అతనికి నేను నా వుద్దేశ్యం చెప్పినప్పుడు అతనేమన్నాడో తెలుసా.... 'మీకు నేను బోధలూ, హెచ్చరికలూ చెయ్యను. మీరు అన్నీ తెలిసినవారు. యాజ్ యూ ప్లీజ్' అన్నాడు. అంతే."

గాయత్రి మంచంమీద వాలి తృప్తిగా వూపిరి పీల్చుకుంది.

నేను ఆలోచనలో పడ్డాను.

* * *

మర్నాడు ఉదయాన్నే ఇంటికి వెళ్ళేను.

నన్ను చూస్తూనే ఆశ్చర్యపోయాడు అన్నయ్య. "ఇదేమిటి—చెప్పాపెట్టకుండా ఊడిపడ్డావ్." అడిగేడు.

"గాయత్రి పెళ్ళికి వెళ్ళొస్తున్నాను. సెలవు ఇంకో మూడు రోజులుంది. అందుకని ఇటు వచ్చాను. నాన్నగారేరి? కులాసాయేనా?"

హాలంతా కలియచూసేను. ఎక్కడి వస్తువులక్కడ 'నీట్'గా సర్దివున్నై.

క్రిందటిసారి నేను ఇంటికొచ్చినప్పుడు ఇంటి అవతారం గుర్తుకొచ్చింది. అప్పుడు హాల్లో సోఫానిండా మాసినబట్టలు పడేసి వున్నై. కుర్చీలమీద తుండ్లు ఆరేసివున్నై. టేబుల్‌మీద దినపత్రికలు, ఇతర పుస్తకాలు కలగాపులగంగా గుట్టగా పోసివున్నై. టీపాయ్‌లమీద ఒకటో రెండో స్టీలుగిన్నెలున్నట్టుగా కూడా గుర్తు.

ఇప్పుడు ఇంటి వాతావరణమే మారిపోయింది. పొందికగా అందంగా వుంది. లోపలి గదీ, వంటిల్లూ కూడా శుభ్రంగా వున్నై. తిరిగి హాల్లోకొచ్చేను.

"ఇల్లు కళకళలాడుతోంది. ఏమిటి విశేషం?" అని కళ్ళు చికిలిస్తూ "కొంపదీసి నాకు తెలీకుండానే పెళ్ళిచేసుకున్నావాయేం?" అన్నాను.

అన్నయ్య నవ్వేడు. "చెప్తానుగానీ నువ్వెళ్ళి స్నానం చేసిరా. కాఫీ తాగి మాట్లాడుకుందాం" అని తను 'కిచెన్'కేసి నడిచేడు.

అన్నయ్య నవ్వు నా సందేహాన్ని బలపరుస్తున్నట్టు అనిపించింది. కానీ, ఇంకా గట్టిగా అడిగినా అప్పుడు చెప్పడు. వాడి తత్త్వం నాకు తెలుసు. అందుకని, ఆత్రుతని అణచుకుని బాత్‌రూమ్‌కి బయల్దేరాను.


కాఫీలయిన తర్వాత మొదలెట్టేడు అన్నయ్య. "నాన్నగారికి నరసపూర్ ట్రాన్స్‌ఫర్ అయింది."

"ఎప్పుడూ? నాకు రాయలేదేం?" ఆశ్చర్యపోతూ అడిగేను.

"నెలరోజులైంది. పదిహేను రోజులు అక్కడే వుండి పదిహేను రోజులు సెలవు పెట్టి వచ్చారు. ఇవ్వాళ్టితో సెలవైపోయింది. అందుకని రాత్రే వెళ్ళారు. జస్ట్‌మిస్డ్. నిన్న వచ్చినా- చూసేదానివి."

"సడన్‌గా ఈ ట్రాన్స్‌ఫర్ ఏమిటి?" అన్నాను సాలోచనగా.

"కొన్ని సంఘటనలు 'సడన్'గానే జరుగుతూ వుంటాయి మరి." అదోలా అని



ఇంకా ఏదో చెప్పటానికి తడబడ్డాడు అన్నయ్య.

"అంటే?" రెట్టించాను.

"అహఁ....మరేంలేదు. సడన్‌గా జరిగే కొన్ని సంఘటనల్ని మనం నిబ్బరంగా రిసీవ్ చేసుకోవటం నేర్చుకోవాలి — తప్పదు."

"అసలేం జరిగిందో చెప్పు....ఊరికే ఫిలాసఫీ బోధిస్తున్నావ్. నీ వాలకం చూస్తుంటే గాయత్రిలా నువ్వూ ఏ మతాంతర వివాహమో చేసుకున్నట్టుందే" అన్నాను. నా ఆలోచనంతా అన్నయ్య పెళ్లి గురించే సాగుతోంది.

అన్నయ్య గొల్లున నవ్వేడు. "నీ పెళ్లి కాకుండా నా పెళ్లి కాదులేగానీ, నే చెప్పే విషయం వేరు." నవ్వుని ఆపుకుంటూ అడిగేడు. "చంద్రయ్యగారి అమ్మాయి వరలక్ష్మి తెలుసుగా...."

"ఆఁ....ఎయిత్ వరకూ అదీ నేనూ క్లాస్‌మేట్స్‌మేగా. ఆ తర్వాత పాపం చదువు ఆపేసింది. అవునూ...అయితే ఏమయింది?"

"ఆమె...ఇప్పుడు...మన పిన్ని—"

నేను ప్రాన్పడి పోయేను. నోట మాట రాలేదు.

క్షణాల తర్వాత అన్నయ్యే చెప్పసాగేడు, "నాన్నగారికి ఈ ఉద్దేశ్యం వుందని తెలుసుకున్నాట్ట చంద్రయ్య. వెంటనే పెళ్ళి సెటిల్ అయిపోయింది. పదిరోజుల క్రితం జరిగింది. పిన్నినీ తీసుకుని నర్సపూర్ వెళ్ళారు నాన్నగారు. ఇల్లు తీర్చి దిద్దినట్టెలా వుందో అర్థమైందిగా."

నా కళ్ళముందు వరలక్ష్మి, నాన్నగారి రూపాలే మెదులుతున్నై. "యాభై రెండు ఇరవై మూడు" నాలో నేను అనుకుంటున్నాననే భావనతో పైకీ అనేశాను కాబోలు: అన్నయ్య అడిగేడు. "ఏమిటి?" అని.

"పెళ్ళికొడుకు పెళ్ళికూతురు వయస్సులు" అని లేచేను.

నా మనస్సంతా కలచినట్లయింది.

పట్టాభిగారూ, ఆయన కోరికా ఆయన ప్రవర్తనా తలపుకొచ్చేయి.

నాన్నగారి చర్య ఎందుకో నన్ను కించపరచినట్లనిపించింది.

అమ్మ కళ్ళముందు మెదిలింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినై.

* * *

ఆఫీసులో 'జాయిన్' అయానన్న మాటేగానీ, మనస్సు మనస్సులో లేకుండాపోయింది. యాంత్రికంగా సాగిపోతోంది దినచర్య.

లంచ్ అవర్‌కు కొంచెం ముందు సుందరి నాకు ఎదురుగా వచ్చి కూర్చుంది.

"ఏమిటోయ్, నీకూ పెళ్ళి బెంగపట్టినట్టుందే. మీ గాయత్రిలా మంచి కుర్రాణ్ణి చూసి 'లవ్' చేద్దామనా ఆలోచన."

నేను మ్లానంగా నవ్వేను.

సుందరి గతుక్కుమన్నది. నాకేసి పరీక్షగా చూసింది. "మనసు బావులేదల్లేవుంది. ఉతికి ఆరేసుకురాక పోయావ్," అంది.

సుందరి జోక్ నవ్వు తెప్పించింది.

"ఏం జరిగిందో చెప్పవోయ్. మరో ఏకలవ్యుడెవరైనా తగిలాడా?" అడిగింది.

పట్టిన పట్టు వదలని సుందరి సంగతి తెలుసు కనుక, విషయాలు చెప్పేద్దామని ప్రారంభించేను. "గాయత్రి పెళ్ళి బాగానే జరిగింది. వెరీ సింపుల్. అటునుంచీ ఇంటికి వెళ్ళేను."

"వెళ్ళావని నీ మొహమే చెప్తోంది."

"మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయింది."

"మద్రాసేనా?"

"కాదు. నర్సాపూర్. నే వెళ్ళిన రోజు క్రితం రాత్రే వెళ్ళిపోయారు."

"అందుకా దిగులు. నాన్నగారిని చూడకపోతే ఇంత బెంగపడేదానివి — పెళ్ళిచేసుకుని అత్తవారింటికేం వెళతావోయ్ నువ్వు" సుందరికి అన్నీ పరిహాసాలే.

"నాన్నగారు పెళ్ళి చేసుకున్నారు ..." దిక్కులు చూస్తూ చెప్పేను.

సుందరి చకిత అయింది.

గాయత్రి భర్తని గురించీ, వరలక్ష్మి గురించీ అన్నీ చెప్పాను.

చాలా సేపటికి తేరుకుంది సుందరి.

"ఈ నిర్ణయాలూ, పెళ్ళిళ్ళూ నాకు మతిపోగొట్టుతున్నాయ్" అన్నాను చివరికి.

సుందరి నవ్వింది వేదాంతిలా. "ఇందులో విశేషమేమీలేదు శకుంతలా. జీవితంలో మనం తీసుకునే చాలా నిర్ణయాల వెనుక ఆర్థిక న్యాయం పూసల్లో దారంలా కనబడీ కనపడకుండా తొంగిచూస్తూనే వుంటుంది. పట్టాభిగారి కోరికని నువ్ తిరస్కరించావ్— ఎందుకని, నీ కాళ్ళమీద నువ్ నిలబడగల శక్తియుక్తులు నీకున్నాయి కనుక. మీ పిన్నికి అవిలేవు కనుక—మీ నాన్నగారి కోరికని తిరస్కరించలేకపోయింది. గాయత్రి నిర్ణయమూ అంతే. తన నిర్ణయాన్ని నెరవేర్చుకోగల నైతిక ధైర్యాన్నిచ్చినవి - ఆమె ఆస్తీ, అంతస్తూ .." జీవిత సత్యాన్ని చెప్తున్నట్టు చెప్పింది.

* * *

నేను మద్రాస్‌కు బదిలీ అయి నెల దాటింది. వోరోజు పోస్ట్‌లో సుందరి నుంచి కవర్ వచ్చింది. ఆనందంతో, వుత్సాహంగా చూసేను.

సుందరి అక్క సుజాతకు పట్టాభిగారితో పెళ్ళయిందనే వార్త!

నేను గతుక్కుమన్నాను.

సుందరి మాటలు గుర్తుకొచ్చినై —

"జీవితంలో మనం తీసుకునే చాలా నిర్ణయాల వెనుక ఆర్థిక న్యాయం పూసల్లో దారంలా కనపడీ కనపడకుండా తొంగిచూస్తూ వుంటుంది—"

***